సాక్షి

మెదక్

బుధవారం । 20 । మార్చి । 2024



భగీరథకు భద్రత కరువు

అక్రమ పేలుళ్లతో మిషన్ భగీరథ తాగునీరు నిల్వ చేసే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భద్రత కరువైంది. ట్యాంకులకు సైతం ప్రమాదం పొంచి ఉంది.


వివరాలు 8లో ▸



ప్రొటోకాల్ పాటించరా?

అధికారులు కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

రైతులకు శాస్త్రీయ విజ్ఞానం అవసరం

డీఏఓ గోవింద్



మాట్లాడుతున్న డీఏఓ గోవింద్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు శిక్షణ పొందుతున్న డీలర్లు కృషి చేయాలని డీఏఓ గోవింద్ అన్నారు. మంగళవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఐసీఏఆర్, కేవీకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తన డీలర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. శిక్షణలో శాస్త్రవేత్తలు డీలర్లకు ఆధునిక వ్యవసాయం, శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, వ్యవసాయ అభివృద్ధిపై శిక్షణ ఇస్తారని చెప్పారు. అనంతరం కేవీకే చైర్మన్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల నేలలో జీవంలేకుండా పోతుందన్నారు. ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. కేవీకే హెడ్, శాస్త్రవేత్త దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ.. డీలర్లకు 48 వారాలు శిక్షణ ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నర్సాపూర్: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి, మిషన్ భగీరథ డీఈఈ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నర్సాపూర్, హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద పోలీసులతో కలిసి మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక వ్యక్తి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లవద్దన్నారు. అంత కంటే ఎక్కువ ఉంటే, అందుకు సంబంధించిన పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

టేక్మాల్(మెదక్): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈఓ రాధాకిషన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం టేక్మాల్ కేజీబీవీని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అక్కడే భోజనం చేశారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసేలా పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు సెక్టోరియల్ అధికారి సుదర్శన్‌మూర్తి, ఎస్ఓ బాలమణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏప్రిల్ 3, 4 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న కిరణ్

మెదక్ కలెక్టరేట్: ఎస్ఎఫ్ఐ జిల్లా 27వ మహాసభలు ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదో తరగతి ప్రశ్నపత్రాలు లీకేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్, జిల్లా కార్యదర్శి సంతోష్, సహాయ కార్యదర్శి అజయ్, సత్యం పాల్గొన్నారు.

వడగండ్లు.. కడగండ్లు

అన్నదాతను ఆగం చేసిన అకాల వర్షం



నిజాంపేటలో నేలవాలిన మొక్కజొన్న

నిజాంపేట(మెదక్)/రామాయంపేట: అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో జిల్లాలోని పలు మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నిజాంపేట మండలంలోని కల్వకుంట, తిప్పన్నగుల్ల, బచ్చురాజ్‌పల్లి, నిజాంపేట గ్రామాల్లో చాలా వరకు పంటలకు నష్టం జరిగింది. చెట్లు నెలకొరగగా, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. సుమారు 1,329 ఎకరాల వరి, 206 ఎకరాల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే అకాలవర్షం నిండాముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నష్టపోయిన పంటలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్, సుతారిపల్లి, శివాయపల్లి గ్రామాల్లో సుమారు 80 ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు.



నేలరాలిన మామిడి కాయలు



నిజాంపేటలో రాలిన ధాన్యం గింజలు

ఎత్తు పెంపు ఉత్తిదేనా!

'ఘణపురం ప్రాజెక్టు'కు గ్రహణం

- నాలుగేళ్లుగా ముందుకుసాగని పనులు
- పూర్తిస్థాయిలో విడుదల కాని పరిహారం
- ఆయకట్టు రైతుల ఎదురుచూపులు

పాపన్నపేట(మెదక్): ఘణపురం ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. పాలకుల నిరాదరణతో పూర్వ వైభవం కోల్పోయింది. నిజాం రాజ్యంలో కళకళలాడిన ప్రాజెక్టు నేడు పూడికతో వెలవెలబోతుంది. ప్రాజెక్టు నిండినా వారం రోజులు కూడా నీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు ప్రభుత్వం 2016లో రూ. 43.64 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి 8 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. నాలుగేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. భూసేకరణ పరిహారం చెల్లించకపోవడం, నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

తగ్గుతున్న నిల్వ నీటి సామర్థ్యం

మెతుకుసీమ రైతుల ఆశలసౌధం గణపురం ప్రాజెక్టును 1905లో అప్పటి నిజాం మంజీర నదిపై కొల్చారం, పాపన్నపేట మండలాల మధ్య నిర్మించారు. అప్పట్లో నిల్వ నీటి సామర్థ్యం 0.2 టీఎంసీలు కాగా ఆయకట్టు 23,425 ఎకరాలు. సుమారు వందేళ్ల పాటు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రాజెక్టు పూడికకు గురై నిల్వ నీటి సామర్థ్యం 0.135 టీఎంసీలకు పడిపోయింది. చివరి ఆయకట్టుకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది.

రూ.43.64 కోట్లు మంజూరు

ఆనకట్ట ఎత్తు పెంపు కోసం 2016లో రూ.43.64 కోట్లు మంజూరు చేశారు. దీంతో 1.725 మీటర్ల ఎత్తు పెంచాలని నిర్ణయించారు. ఫలితంగా నిల్వ నీటి సామర్థ్యం 0.3 టీఎంసీలకు పెరుగుతుందని.. అదనంగా సుమారు 8 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని భావించారు. ఎత్తు పెంపు కోసం పాపన్నపేట మండలంలో 128.28 ఎకరాలు, కొల్చారం మండలంలో 62.26 ఎకరాలు భూసేకరణ జరపాలని నిర్ణయించారు. ఇందుకు గానూ రూ.18 కోట్లు అవసరం. అయితే ఇప్పటివరకు రూ.5 కోట్లు మాత్రమే విడుదల కాగా వాటిని పాపన్నపేట రైతులకు పంపిణీ చేశారు. ఇంకా రూ.8 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఎత్తు పెంపు కోసం విడుదల అయిన నిధులతో 72.45 మీటర్ల మేర యాప్రాన్ పని చేశారు. నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. నాలుగేళ్లుగా అసలు పనులే జరగడం లేదు. మెదక్ ఎమ్మెల్యే స్పందించి నిధులు విడుదల చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ఘణపురం ఆనకట్ట

ప్రతిపాదనలు పంపాం

నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కొల్చారం మండలంలో భూసేకరణ కోసం ఇంకా అవార్డు పాస్ కాలేదు. నిధులు విడుదల అయితే పనులు ప్రారంభిస్తాం. ఎత్తు పెంపు జరిగితే ఆనకట్టలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుంది. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందుతుంది.

– శివనాగరాజు, ఇరిగేషన్ డీఈ



మెదక్: పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రెండో రోజూ ప్రశాంతం

'పది' పరీక్షకు 99.78 శాతం హాజరు

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి పరీక్షలు రెండో రోజూ ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. మంగళవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేయగా, నర్సాపూర్ జెడ్పీ పాఠశాలను అదనపు కలెక్టర్ రమేశ్ సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. రెండోరోజూ జరిగిన పరీక్షకు 10,275 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థుల హాజరుశాతం 99.78గా నమోదైంది. జిల్లాలోని టేక్మాల్, అల్లాదుర్గం, పాపన్నపేటలో గల పరీక్ష కేంద్రాలను డీఈఓ రాధాకిషన్ సందర్శించి తనిఖీ చేశారు. అలాగే చిన్నశంకరంపేట, చేగుంట, మనోహరాబాద్‌లో గల 6 పరీక్ష కేంద్రాలను జిల్లాస్థాయి పరిశీలకులు పరిశీలించారు. కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్, మెదక్, హవేళిఘణాపూర్, వెల్దుర్తి, శివ్వంపేటలో గల 19 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించగా, మెదక్‌లోని మరో పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరీక్షల విభాగం అధికారి పరిశీలించారు.

సిబ్బంది పనితీరు ఆదర్శం

మెదక్ కలెక్టరేట్: కళాశాల సిబ్బంది పనితీరు ఆదర్శనీయమని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. మంగళవారం మెదక్ పట్టణంలోని పిల్లికోట్యాల్‌లో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా కళాశాల నిర్వహణ తీరు, కోర్సుల వివరాలు, విద్యార్థుల పాస్ పర్సంటేజ్ గురించి వైస్ ప్రిన్సిపాల్ సబితను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ విద్యా బోధన అందిస్తూ విద్యా నైపుణ్యాలను మెరుగుపరిచి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

బాలికలు, మహిళల రక్షణకే షీటీమ్స్

అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: బాలికలు, మహిళల రక్షణకు షీ టీమ్స్ ఎల్లవేళలా పనిచేస్తాయని, సమస్యలుంటే 8712657963 నంబర్‌కు సమాచారమివ్వాలని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో షీటీమ్స్ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పురుషులతో పాటు మహిళలు సమానంగా పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకొని ఇంకా ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందని భరోసా ఇచ్చారు.



షీటీం సభ్యులతో మాట్లాడుతున్న మహేందర్

ఏసీబీ వలలో కానిస్టేబుల్





పట్టుబడిన డబ్బులతో కానిస్టేబుల్ సురేందర్

హవేళిఘణాపూర్(మెదక్): లంచం తీసుకుంటూ మెదక్ రూరల్ కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం అవుసులపల్లికి చెందిన కందుల చంద్రం ఇటీవల ఇసుక తరలిస్తుండగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. వారు మెదక్ రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ బయటకు రావాలంటే రూ. 20 వేలు ఇవ్వాలని కానిస్టేబుల్ (రైటర్) సురేందర్ డిమాండ్ చేయగా చంద్రం రూ.15 వేలు ఇచ్చి స్టేషన్ బెయిల్ తీసుకున్నాడు. తర్వాత పట్టుబడిన ట్రాక్టర్ విషయమై మైనింగ్ అధికారులకు లేఖ రాశారు. వారు రూ. 5 వేల జరిమానా విధించి రిలీజ్ ఆర్డర్ ఇచ్చారు. ఆర్డర్ కాపీతో చంద్రం పోలీస్‌స్టేషన్‌కు రాగా మరో రూ.5 వేలు ఇవ్వాలని కానిస్టేబుల్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.4 వేలకు ఒప్పందం కుదుర్చుకొని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లోనే రూ. 4 వేల లంచం తీసుకుంటుండగా కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కానిస్టేబుల్ స్వగ్రామం హవేళిఘణపూర్ మండలం ఫరీద్‌పూర్ తండాలోని ఇంట్లో సోదాలు నిర్వహించారు. కేసులో ఎవరెవరు ఉన్నారనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఓట్ల వేట

- గంపగుత్తా ఓట్ల కోసం అభ్యర్థుల తంటాలు
- కులసంఘాలతో సమావేశాలు..
- మద్దతు కూడగట్టుకునే పనిలో నిమగ్నం
- క్షేత్ర స్థాయి పర్యటనల్లో జహీరాబాద్ లోక్‌సభ ప్రధాన పార్టీల అభ్యర్థులు



బీబీ పాటిల్
బీజేపీ అభ్యర్థి



సురేష్‌షెట్కార్
కాంగ్రెస్ అభ్యర్థి



గాలి అనిల్‌కుమార్
బీఆర్ఎస్ అభ్యర్థి


సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగనున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు సుమారు పక్షం రోజుల ముందే ఇక్కడ ఆయా పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో ప్రజాక్షేత్రంలోకి వెళ్తున్నారు. గెలుపు కోసం ఇప్పటి నుంచే తంటాలు పడుతున్నారు. గంప గుత్తాగా ఓట్లు సాధించే అంశాలపై అభ్యర్థులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లో పర్యటనలు చేస్తున్నారు. ఎన్నికల్లో కీలకమైన నేతలను, కులసంఘాల నాయకులను కలుస్తున్నారు. అలాగే ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పార్టీ ఇన్‌చార్జిలు కీలక ప్రజాప్రతినిధులతో భేటీ అవుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా..

లోక్‌సభ ఎన్నికలు అసెంబ్లీ ఎలక్షన్స్ భిన్నంగా ఉంటాయి. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి తక్కువ ఉండటంతో అభ్యర్థులు ఓటర్లను ప్రత్యక్షంగా కలిసేందుకు మొగ్గు చూపుతుంటారు. ఇంటింటికీ తిరిగి నేరుగా ఓటర్లతో మమేకం అవుతుంటారు. ఈ ఎన్నికల్లో ఇలా ప్రచారం చేయడానికి వీలు పడదు. లోక్‌సభ నియోజకవర్గం పరిధి విస్తృతంగా ఉంటుంది. జహీరాబాద్ లోక్‌సభ స్థానం ఏకంగా సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లను ప్రత్యక్షంగా కలవడం సాధ్యం కాదు. దీంతో గంపగుత్తా ఓట్లు సాధించడం కోసం ప్రయత్నాలపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించారు.

చేరికలపై పాటిల్ ప్రయత్నాలు

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఎన్నికల వేళ బీజేపీలో చేరారు. ఆపార్టీ ఆయనకే టికెట్ కేటాయించింది. పాటిల్ బీఆర్ఎస్‌ను వీడుతున్న సమయంలో ఆయన వెంట చెప్పుకోదగిన నాయకులు ఎవరూ వెళ్లలేదు. కాగా పాటిల్ జహీరాబాద్, నారాయణఖేడ్‌లలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశాలను నిర్వహించారు. ఇటు జోగిపేటలోనూ శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మరోవైపు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ చేరికల కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాని మోదీ చరిష్మాపై ఆశలు పెట్టుకున్న ఆయన నియోజకవర్గం అంతటా తిరుగుతున్నారు.



సామాజికవర్గాల నేతలతో సమావేశం

కాంగ్రెస్ తన తొలి జాబితాలోనే సురేష్ షెట్కార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఆయన నియోజకవర్గంలో ఓట్ల వేటలో పడ్డారు. కుల సంఘాల నాయకులతో కలిసి షెట్కార్ సమావేశాలు నిర్వహించారు. జహీరాబాద్, నారాయణఖేడ్, న్యాల్‌కల్ తదితర చోట్ల లింగాయత్ సామాజికవర్గం సన్మాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన షెట్కార్ ఆయా సామాజికవర్గం మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలను కూడా షెట్కార్ కలిశారు. ఇలా మూడు పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంతో పాటు, వివిధ వర్గాల మద్దతు కోసం మల్లగుల్లాలు పడుతుండటంతో నియోజకవర్గంలో ఎన్నికల కోలాహలం కనిపిస్తున్నది.

ప్రజాప్రతినిధులతో 'గాలి' వరుస భేటీలు

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను ప్రకటించింది. దీంతో ఆయన నియోజకవర్గంలో కలియదిరుగుతున్నారు. గులాబీ పార్టీ ప్రజాప్రతినిధులతో వరుస భేటీలు అవుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ఇప్పటికే కలిశారు. జహీరాబాద్, బాన్సువాడ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయా అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జిలుగా ఉన్న నాయకులను ఒక విడత కలిశారు. మండలాల్లో కూడా పర్యటిస్తున్నారు. ఆయా మండలాల్లో ఉన్న గులాబీ నాయకులను, ప్రజాప్రతినిధులతో కలుస్తున్నారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల్లో కులసంఘాల నాయకులతో మమేకం అవుతున్నారు. మొత్తంగా ఇటు కులసంఘాల నేతలను, పార్టీ క్యాడర్‌ను కలుస్తూ ఎన్నికల్లో దూసుకుపోతున్నారు.

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణా
రెండు లారీలు పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

వర్గల్‌(గజ్వేల్‌): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు సీజ్‌చేశారు. అనుమతుల్లేకుండా ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్న రెండు లారీలను వర్గల్‌ మండలం గౌరారం వద్ద టాస్క్‌ఫోర్స్‌ సీఐ జానకిరాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్‌ బియ్యం రవాణా, పేకాట, జూదం, గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయించడం నేరమన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు తెలిస్తే 87126 67445, 87126 67446 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

రేషన్‌ బియ్యం పట్టివేత


రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్‌): అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మండల పరిధి రెడ్యా తండా నుంచి రేషన్‌ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్న విషయం తెలుసుకున్న సివిల్‌ సప్లయ్‌ ఉప తహసీల్దార్‌ ప్రణీత, ఆర్‌ఐలు కిషన్‌, సునీల్‌ చేరుకుని తండాకు చెందిన ధన్‌రాజ్‌ ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. ఆటోతోపాటు 9క్వింటాళ్ల బియ్యాన్ని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సివిల్‌ సప్లయ్‌, రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హోటల్‌ సిబ్బంది దాడి

రామాయంపేట(మెదక్‌): భోజనం చేయడానికి వెళ్లిన ఓ వ్యక్తిపై హోటల్‌ సిబ్బంది దాడిచేశారు. వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న రవి భోజనం చేయడానికిగాను ఆధ్యా హోటల్‌కు వెళ్లాడు. అక్కడ తనకు, హోటల్‌ సిబ్బందికి గొడవ జరుగడంతో వారు తనను లోపలికి లాక్కెళ్లి కర్రలు, రాడ్లతో చితకబాదారని బాధితుడు రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌ తెలిపారు.

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుల అరెస్టు

సిద్దిపేటఅర్బన్‌: మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌ తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. బక్రిచెప్యాల గ్రామానికి చెందిన మండవరాజు శ్రీకాంత్‌, జక్కుల రాజు, మోదుదుల రాజశేఖర్‌ కలిసి మద్యం తాగిన మైకంలో ఫిబ్రవరి 25 అర్ధరాత్రి బస్టాండ్‌ వద్ద గల గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు తెలిపారు. అనుమానంతో ముగ్గురు నిందితులను విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన

సిద్దిపేటఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్‌ మీడియెట్‌ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆ బోర్డు అధికారులు విశ్వేశ్వర్‌, యాదగిరి మంగళవారం సందర్శించారు. మూల్యాంకనం జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మూల్యాంకన కేంద్రం అధికారి సూర్య ప్రకాశ్‌, సహాయ అధికారులు సత్యనారాయణరెడ్డి, అమరేందర్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

‘భగీరథ’కు భద్రత కరువు

అక్కన్నపేటలో పేలుళ్లు | ప్రమాదం అంచున రిజర్వాయర్‌, ట్యాంకులు | పట్టించుకోని అధికారులు

అక్రమ పేలుళ్లతో భగీరథ తాగునీరు నిల్వచేసే బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌కు భద్రత కరువైంది. అంతేకాదు గ్రామాలు, తండాలకు తాగునీరు సరఫరాచేసే ట్యాంకులకు కూడా ప్రమాదం పొంచి వుంది. ఈ విషయమై గతంలో భగీరథ గ్రిడ్‌ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదు.


కోనాపూర్‌లో నీటి ట్యాంకుల వద్ద బండరాళ్లు



అక్కన్నపేట రిజర్వాయర్‌ సమీపంలో..

రామాయంపేట(మెదక్‌): మండలంలోని అక్కన్నపేట సమీపంలో ఎత్తయిన ప్రదేశంలో ఓహెచ్‌బీఆర్‌(ఓవర్‌ హెడ్‌ బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌) నిర్మించారు. రెండున్నర లక్షల లీటర్ల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌ ద్వారా కోనాపూర్‌ బండపై నిర్మించిన ఓహెచ్‌బీఆర్‌కు, రామాయంపేట, నార్సింగి, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాల పరిధిలోని 80 గ్రామాలకు ప్రతిరోజూ తాగునీరు సరఫరా అవుతోంది. అయితే ఈ రిజర్వాయర్‌, ట్యాంకుల వద్ద కొందరు రియాల్టర్లు, రైతులు తమ ఇష్టారాజ్యంగా పేలుళ్లు నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కిందట అక్కన్నపేట వద్ద ఉన్న రిజర్వాయర్‌ సమీపంలోనే రియాల్టర్లు కొందరు భూముల్లో అక్రమ పేలుళ్లు నిర్వహించి బండరాళ్లను తొలగించే ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో గ్రిడ్‌ అధికారులు రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాని ఆ తర్వాత దానిని ఎవరూ పట్టించుకోలేదు.

రోడ్డు విస్తరణలో భాగంగా..

తాజాగా మెదక్‌, రామాయంపేట రోడ్డు విస్తరణలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్‌ అక్కన్నపేట వద్ద రిజర్వాయర్‌ సమీపంలో పేలుళ్లు నిర్వహిస్తూ బండరాళ్లను తొలగిస్తున్నారు. ఇదే కాకుండా మండలంలోని కోనాపూర్‌ పెద్దతండా వద్ద కొత్తగా నిర్మించిన నీటి సరఫరా ట్యాంక్‌ కింది భాగంలోనూ పేలుళ్లు చేపట్టారు. ఇలా వాళ్ల ఇష్టానుసారంగా పేలుళ్లు కొనసాగిస్తే ట్యాంకులు కూలిపోయే ప్రమాదం నెలకొంది. ఇకనైనా గ్రిడ్‌ అధికారులతోపాటు పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చర్యలు చేపడతాం..

ఈ విషయమై గ్రిడ్‌ డీఈ నాగభూషణాన్ని సంప్రదించగా రిజర్వాయర్‌ సమీపంలోను, కోనాపూర్‌ తండా సమీపంలోని ట్యాంకుల వద్ద అక్రమ పేలుళ్ల విషయమై తన దృష్టికి రాలేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రామాయంపేట ఎస్‌ఐ రంజిత్‌ను సంప్రదించగా ట్యాంకుల వద్ద గాని, ఇతర చోట్ల గాని అక్రమంగా పేలుళ్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్యాంకుల వద్దకు వెళ్లి పరిశీలించి విచారణ చేపడతానని చెప్పారు.

తాళం వేసిన ఇళ్లల్లో దొంగల బీభత్సం


ఇంటి వద్ద పరిశీలిస్తున్న సీఐ లతీఫ్‌

తొగుట(దుబ్బాక): తాళం వేసిన ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఐదు ఇళ్లను టార్గెట్‌ చేసి తాళాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన తొగుట మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పాగాల రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి తిరుపతి దైవ దర్శనం కోసం వెళ్లారు. వారి ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు 5తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన పయ్యావుల అనిల్‌ ఇంట్లో రూ.40వేల నగదు, నాలుగు తులాల బంగారం, 10 తులాల వెండి; లచ్చుగారి అనసూయ ఇంట్లో నాలుగు తులాల బంగారం; మంగళి నాగయ్య, కిష్టయ్యల ఇంట్లో ఏమీ దొరకలేదు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న తొగుట సీఐ లతీఫ్‌, ఎస్‌ఐ లింగం దొంగతనం జరిగిన ఐదు ఇళ్లలో పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని చెప్పారు. దొంగలు బీభత్సం సృష్టించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు.

గంజాయి కేసులో ఆరుగురికి జైలు

పటాన్‌చెరు: గంజాయి తరలింపు కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.20వేల చొప్పున జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్‌ సీఐ పరమేశ్వర్‌ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్తంగి రింగ్‌ రోడ్డు సమీపంలో 14 జూన్‌, 2020న మూడు కార్లుల్లో తరలిస్తున్న 300 కిలోల గంజాయిని ఎక్సైజ్‌ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మూడు కార్లు, 6 సెల్‌ఫోన్‌లను సీజ్‌చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితులు సదాశివపేటకు చెందిన కరీమొద్దీన్‌, మొయినాబాద్‌కు చెందిన ఆంజనేయులు, రాయికోడ్‌కు చెందిన లింగం, జహీరాబాద్‌కు చెందిన రవీందర్‌, ప్రవీణ్‌, బీదర్‌కు చెందిన వినాయక్‌ను విచారించిన మొదటి అదనపు డిస్ట్రిక్ట్‌ అండ్‌ సెషన్స్‌ జడ్జి సుదర్శన్‌ మంగళవారం తీర్పు వెలువరించినట్టు ఎక్సైజ్‌ పోలీసులు తెలిపారు.

లారీ డ్రైవర్లే దొంగలై..

పటాన్‌చెరు టౌన్‌: గమ్యం చేర్చాల్సిన డ్రైవర్లే దొంగలుగా మారి తమ లారీల నుంచి స్టీల్‌ రాడ్‌లను దొంగిలిస్తుండగా కన్‌స్ట్రక్షన్‌ సెక్యూరిటీ రెడ్‌ హ్యాండెడ్‌ గా పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన బీడీఎల్‌ భానూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామచంద్రపురం మండలం వెలిమెల శివారులోగల స్టీల్‌ అథారిటీ పరిశ్రమ నుంచి అపర్ణ కన్‌స్ట్రక్షన్‌కు లారీలలో స్టీల్‌రాడ్లు తీసుకెళ్తుంటారు. కొంతకాలంగా స్టీల్‌ తక్కువగా వస్తుండడం గమనించిన యజమాన్యం సెక్యూరిటీని నిఘా పెట్టింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి పరిశ్రమ నుంచి తీసుకెళ్తున్న మూడు లారీల డ్రైవర్లు వెలిమెల తండా సమీపంలో ఖాళీ స్థలంలో లారీలను ఆపి 1,214 కిలోల స్టీల్‌ రాడ్లను దొంగిలిస్తుండగా సెక్యూరిటీ గార్డులు గమనించారు. దీంతో లారీ డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. స్టీల్‌ రాడ్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్ల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఎలక్ట్రిక్‌ బైక్‌ నుంచి మంటలు


మంటలను ఆర్పుతున్న కానిస్టేబుల్‌ మహేశ్‌

సిద్దిపేటకమాన్‌: ఎలక్ట్రిక్‌ బైక్‌ నుంచి మంటలు చెలరేగిన ఘటన సిద్దిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శ్రీనివాస్‌ నరేందర్‌తో కలిసి తన ఎలక్ట్రిక్‌ బైక్‌పై హౌజింగ్‌ బోర్డు నుంచి సిద్దిపేట వైపు వస్తున్నాడు. మోడ్రన్‌ బస్టాండ్‌ వద్దకు రాగానే బైక్‌ నుంచి పొగలు రావడాన్ని వెనకాల వస్తున్న వాహనదారులు చూసి అప్రమత్తం చేశారు. బైక్‌ను రోడ్డు పక్కన నిలపగా బైక్‌ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్టాండ్‌ చౌరస్తాలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్‌ ఏఎస్‌ఐ ఉమేశ్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ సత్తయ్యగౌడ్‌, శ్రీనివాస్‌, కానిస్టేబుల్‌ కొన్నె మహేశ్‌, హోంగార్డు షాకీర్‌ అప్రమత్తమై మంటలను ఆర్పారు.

పరీక్షలకు వెళ్తూ గాయపడిన విద్యార్థులు


ప్రశాంత్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): పదో తరగతి పరీక్షలు రాయడానికి బైక్‌పై వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు గాయపడిన ఘటన మండల పరిధిలోని ముంగి గ్రామ శివారులో చోటు చేసుకొంది. హద్నూర్‌ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. నిచిగెపల్లికి చెందిన ప్రశాంత్‌, అనిల్‌, డప్పూర్‌ గ్రామానికి చెందిన పెంటప్ప స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నారు. మంగళవారం ఉదయం పరీక్షలు రాసేందుకు వారు బైక్‌పై బయలుదేరారు. ఈక్రమంలో ముంగి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ప్రశాంత్‌ను 108లో జహీరాబాద్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన ఇద్దరు విద్యార్థులకు స్థానికంగా చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మారుతి రాథోడ్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పాలిటెక్నిక్‌ ‘ప్రతిభ’


ల్యాబ్‌లో విద్యార్థులను పరీక్షిస్తున్న కలెక్టర్‌ మనుచౌదరి

- 9 మందికి రూ.13.5 లక్షలు మంజూరు
- వసతులు కల్పిస్తే ఉన్నత స్థానాలకు
- హాస్టల్‌, ల్యాబ్‌లు, రోడ్డు సౌకర్యాల కరువు

హుస్నాబాద్‌రూరల్‌: ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీ విద్యార్థులు మూడేళ్ల నుంచి ప్రధాన మంత్రి ప్రతిభ ఉపకార వేతనాలకు ఎంపికై ఏడాదికి రూ.50వేలు స్కాలర్‌షిప్‌ పొందుతున్నారు. ప్రిన్సిపాల్‌ సతీశ్‌కుమార్‌ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొనేందుకు కృషి చేస్తున్నారు.

పదిలో మంచి మార్కులు సాధించాలి

ప్రధాన మంత్రి ప్రతిభ స్కాలర్‌షిప్స్‌ పొందడానికి విద్యార్థులు టెన్త్‌లో మంచి మార్కులు సాధించాల్సి ఉంది. ఈ స్కాలర్‌షిప్స్‌ పొందడానికి నేషనల్‌ స్కాలర్‌షిప్స్‌ పోర్టల్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కాలేజీలో చేరిన విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే ప్రిన్సిపాల్‌ ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేయిస్తారు. ఆయన కృషితో మూడేళ్ల నుంచి తొమ్మిది మంది ఎంపికయ్యారు. వారికి ప్రతిఏటా రూ.50 వేల చొప్పున మూడేళ్లకు రూ.1.50లక్షలు స్కాలర్‌షిప్‌ వస్తుంది. దీనితో విద్యార్థులు తమ తల్లిదండ్రులపై ఆధారపడకుండానే బీటెక్‌ పూర్తి చేయడానికి ఉపయోగిస్తున్నారు.

సౌకర్యాల కరువు

2017లో ప్రారంభమైన ఈ పాలిటెక్నిక్‌ కాలేజీలో బాలికలు, బాలుర హాస్టళ్లను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అదేవిధంగా అవసరమైన ల్యాబ్‌లు, తాగునీరు, రోడ్డు సౌకర్యాలు లేవు. బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు నిత్యం హుస్నాబాద్‌ వరకు కాలినడకన వస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సమయానికి వారికి ఆహారం లేక బలహీనతతో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అనారోగ్యం విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోంది. వసతి గృహాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తే ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం సివిల్‌, ఈఈఈ బ్రాంచిలల్లో 120 సీట్లు మాత్రమే ఉన్నాయి. కంప్యూటర్‌ సైన్స్‌ బ్రాంచి ఏర్పాటుచేస్తే మరికొంత మంది విద్యార్థులకు డిప్లొమా చేసే అవకాశం దొరుకుతుందని స్థానికులు ఆశిస్తున్నారు.

ఆర్థిక భారం తగ్గింది



నాకు ఈఈఈలో వచ్చింది. ప్రిన్సిపాల్‌ సార్‌ ప్రతిభ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయించడంతో అమ్మానాన్నకు ఆర్థిక భారం తగ్గింది. నా చదువులకు అయ్యే ఖర్చులను నా ప్రతిభాతోనే సాధించాను.
– సాక్షి, ఈఈఈ, కామారెడ్డి

బస్సు సౌకర్యంలేక..



మాది గుట్టల పక్కన ఉండే ఉమ్మాపూర్‌. మా ఊరుకు బస్సు కూడా రాదు. పాలిటెక్నిక్‌లో సీటు వస్తే సంతోషపడ్డాను కాని కాలేజీకి వచ్చేందుకు బస్సు సౌకర్యం లేక మా అమ్మమ్మ ఇంట్లో ఉండి కాలేజీకి వస్తున్నాను.
– సంధ్య, సివిల్‌ ఇంజనీరింగ్‌

ఇంజనీర్లుగా చేయాలి



గ్రామీణ విద్యార్థులను పాలీసెట్‌ రాయించి ఇంజనీర్లుగా చేయాలనే లక్ష్యంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. హాస్టల్‌ నిర్మాణం, తాగునీరు, రోడ్డు సౌకర్యం కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రతిభ స్కాలర్‌షిప్స్‌కు కూడ మేమే దరఖాస్తు చేయిస్తున్నాం.
– సతీశ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌

బయోలాజికల్‌కు ప్రాధాన్యం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

డాక్టర్‌ రెడ్డీస్‌ ప్రతినిధి రాజశేఖర్‌

నర్సాపూర్‌: రాబోయే రోజులలో బయోలాజికల్‌కు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని డాక్టర్‌ రెడ్డీస్‌ ల్యాబొరేటరీ వైస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ రాజశేఖర్‌ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు జేఎన్‌టీయూకే హెచ్‌ఓడీ డాక్టర్‌ భవాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే కాలంలో ఔషధరంగంలో బయోలాజికల్‌ డోసేజ్‌ఫామ్స్‌కు అధిక ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. భవాని మాట్లాడుతూ ఫార్మారంగంలో మహిళలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీసీఐ సెంట్రల్‌ కౌన్సిల్‌ సభ్యుడు డాక్టర్‌ ప్రభాకర్‌రెడ్డి ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. వైపర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డా.రమేశ్‌, హెచ్‌ఓడీ రాజేంద్రప్రసాద్‌ పాల్గొన్నారు.

బాలుడిని బలిగొన్న ఈత సరదా

- స్నేహితులతో వెళ్లి అనంతలోకాలకు
- మరొకరిని కాపాడిన స్థానికులు


నియత్‌ ఖాన్‌ (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: ఈతకు దిగిన ఇద్దరు చిన్నారుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరిని స్థానికులు కాపాడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్‌ అలీ కథనం ప్రకారం.. గౌతమ్‌ నగర్‌కు చెందిన ఫరీద్‌ ఖాన్‌ కుమారుడు మహమ్మద్‌ నియత్‌ ఖాన్‌(10) పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఆ బాలుడు అతని సోదరుడు ఫైజల్‌(5), అదే కాలనీకి చెందిన మరో నలుగురు స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు గౌతమ్‌ నగర్‌ సమీపంలోగల మూతబడిన పరిశ్రమలో ఉన్న బాయిలర్‌ గుంతలోకి నియత్‌ ఖాన్‌, స్నేహితుల్లో ఒకడైన రాహుల్‌ దిగారు. ఇద్దరు నీట మునిగిపోవడంతో అక్కడి సెక్యూరిటీ గార్డ్‌ నర్సింహులు గమనించి రాహుల్‌ను కాపాడాడు. అప్పటికే నీట మునిగి నియాత్‌ ఖాన్‌ మృతి చెందాడు. రాహుల్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నియత్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫరీద్‌ఖాన్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైలు నుంచి కిందపడి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చేగుంట/వెల్దుర్తి(తూప్రాన్‌): నడుస్తున్న గుర్తు తెలియని రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ తావూ నాయక్‌ తెలిపారు. వడియారం–మాసాయిపేట రైల్వే స్టేషన్‌ మధ్యలో 555/15 మైలు రాయివద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి పడి తీవ్ర గాయాలై మృతి చెందాడని ఆయన చెప్పారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించామని, ఆ వ్యక్తి 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని తెలిపారు. బంధువులెవరైనా ఉంటే కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ చెప్పారు.

గోడకూలి..

పటాన్‌చెరు టౌన్‌: పనిచేసే చోట గోడకూలి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్‌ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌ మండల్‌ పోచారం గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్‌ దంపతులు పటాన్‌చెరు వలస వచ్చి ముత్తంగిలో ఉంటూ పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఐటీడబ్ల్యూ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ పరిశ్రమలో కాంట్రాక్ట్‌ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గోపాల్‌ పరిశ్రమ ఆవరణలో పాత గోడను కూల్చివేస్తున్న క్రమంలో గోడకూలి అతడిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..


ఎల్లయ్య(ఫైల్‌)

కోహీర్‌(జహీరాబాద్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దిగ్వాల్‌ గ్రామ శివారులో 65వ నంబర్‌ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటు చేసుకొంది. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. బోయిని ఎల్లయ్య(50) కోహీర్‌ మండలం ఖానాపూర్‌ గ్రామ నివాసి. కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం ఉదయం న్యాల్‌కల్‌ మండలంలోని చీకుర్తి గ్రామంలో ఉంటున్న తన కూతురు వద్దకు తన టీవీఎస్‌ వాహనంపై బయలుదేరాడు. దిగ్వాల్‌ గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. జహీరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. భార్య పుణ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్‌, నిజాంపూర్‌ గ్రామాల్లోని కొన్ని కిరాణా దుకాణాల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక దాడులుచేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్‌, నిజాంపూర్‌ గ్రామాల్లోని పలు కిరాణా దుకాణాల్లో ఎలాంటి లైసెన్సులు లేకుండా అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్నారన్న సమాచారంతో సోదాలు చేశామని చెప్పారు. వెంకటాపూర్‌కు చెందిన నాగుల స్వరూప దుకాణం వద్ద రూ.7,524 విలువగల 38 మద్యం బాటిళ్లు, అదేవిధంగా నిజాంపూర్‌ గ్రామంలోని ఎల్చాలా యేసు కిరాణం దుకాణంలో రూ.6,336 విలువగల మద్యం, అదే గ్రామంలో జక్రిగాల లక్ష్మయ్య వద్ద నుంచి రూ.22,382 విలువగల 91బాటిళ్ల అక్రమ మద్యాన్ని సీజ్‌ చేసి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య


శైలేందర్‌రెడ్డి(ఫైల్‌)

ములుగు(గజ్వేల్‌): అనారోగ్య సమస్యను తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపల్లికి చెందిన కుంట్ల శైలేందర్‌రెడ్డి(34) ఎనిమిది సంవత్సరాలుగా మొలలు వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా వ్యాధి నయంకాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై..


శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అహ్మద్‌ మోహినోద్దీన్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గౌరిగారి శ్రీకాంత్‌రెడ్డి(26)కి నాలుగేళ్ల క్రితం పెళ్లవ్వగా ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. రెండేళ్ల నుంచి మద్యానికి బానిసై నిత్యం తాగివచ్చి గొడవపడడంతో అతడి భార్య రక్షిత పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న శ్రీకాంత్‌ ఉరివేసుకుని చనిపోతానని పక్కింటి వాళ్లతో చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. పక్కింటి వారు పరిశీలించగా దూలానికి ఉరివేసుకుని ఉండడం గమనించారు. విషయం తెలుసుకుని భార్య రక్షిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌ గేమ్‌లకు అలవాటు పడి..


పవన్‌కల్యాణ్‌(ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): ఆన్‌లైన్‌ గేమ్‌లకు అలవాటుపడి అప్పుల బాధతో ఫార్మసీ ఉద్యోగి మద్దెల పవన్‌ కల్యాణ్‌(26) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సిద్దిపేటలోని ప్రశాంత్‌ నగర్‌ ఎన్‌జీఓస్‌ కాలనీకి చెందిన ఆ యువకుడు జగదేవ్‌పూర్‌ మండలంలోని ఎంఎస్‌ఎన్‌ ప్రైవేటు ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న ఇంటి నుంచి డ్యూటీకి వెళ్తున్నానని చెప్పివెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో మంగళవారం వెలికట్ట గ్రామ శివారులో రైల్వేట్రాక్‌ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఉండడాన్ని కుకునూరుపల్లి పోలీసులు గమనించారు. ఐడీకార్డు ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతుడు కొంత కాలంగా ఆన్‌లైన్‌లో గేమ్స్‌ ఆడుతూ అప్పుల పాలయ్యాడని, తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపంలోమృతి చెందాడని మృతుడి తండ్రి పరమేశ్‌ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు.